క్లుప్తంగా

పంపిణీకి సిద్ధంగా జీలుగ విత్తనాలు

కోదాడరూరల్ : మండలంలోని గల అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యాలయాల్లో (పీఏసీఎస్) పచ్చిరొట్టె ఎరువు సాగు కోసం జీలుగ విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని ఏఓ పాలెం రజిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కేజీల బస్తాను సబ్సిడీ ధర రూ.842.70కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆయా కార్యాలయాల్లో పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు అందజేసి తీసుకోవచ్చని పేర్కొన్నారు.

12న హుజూర్‌నగర్‌లో ‘తెలంగాణ రన్’

పాలకవీడు : తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12వ తేదీన ఉదయం 6 గంటలకు హుజూర్‌నగర్‌లోని ఇందిరాచౌక్ నుంచి గాంధీ పార్క్ వరకు నిర్వహించబోయే ×తెలంగాణ రన్‌* ను విజయవంతం చేయాలని ఎస్సై ఎం.లింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించనున్న తెలంగాణ రన్ కు మండలం నుంచి యువతీ యువకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

దశాబ్ది ఉత్సవాలతో ప్రజాధనం వృథా

మునగాల : దశాబ్ది ఉత్సవాలతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోందని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మునగాలలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా పోరాడిన ఉద్యమకారులను రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. దశాబ్ది ఉత్సవాలు చూస్తుంటే దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

హుజూర్‌నగర్ : నియోజవర్గంలో అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని సామాజిక కార్యకర్త బుడిగె రమేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీఓ కార్యాలయ డివిజినల్ పరిపాలన అధికారి ప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు పూర్తి కావస్తున్నందున విద్యార్థుల కోసం గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పరిసర గ్రామలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు.

స్నేహం ఎంతో గొప్పది

కోదాడరూరల్ : ప్రాణ మిత్రుడి సంతాప దినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం వారి మధ్య ఉన్న స్నేహానికి నిదర్శనమని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన ఆకునూరి నరేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం నరేష్ సంతాప దినం సందర్భంగా అతని స్నేహితుడు వై.డి.రెడ్డి ఖమ్మం క్రాస్‌రోడ్‌లోని 26వ వార్డులో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. స్నేహం ఎంతో గొప్పదని దాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వై.వేణు, మాధవరెడ్డి, మల్లికార్జునరెడ్డి, శ్రీకాంత్, కిషోర్, వెంకటేశ్వర్లు, నాగులు ఉన్నారు.

ధ్రువపత్రాల జారీలో అలసత్వం

మునగాల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీలో కార్యాలయ సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారని, ఫలితంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని బహుజన నాయకుడు రాయిరాల సుమన్ ఆరోపించారు. శుక్రవారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గురుకుల పాఠశాలలో సీటు సాధించిన విద్యార్థులకు ధ్రువపత్రాలు సకాలంలో ఇవ్వడం లేదని ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు తెలిపినా ఫలితం లేదని తెలిపారు. అంతేకాకుండా తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువపత్రాల జారీలో సిబ్బంది చేతి వాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో ధ్రువపత్రాలు అందేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

ఆరోపణలు అవాస్తవం..

తహసీల్దార్ కార్యాలయంలో కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీలో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారనేది అవాస్తవమని తహసీల్దార్ జవహర్‌లాల్ అన్నారు. మీసేవ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రెండు, మూడు రోజుల్లోనే ధ్రువపత్రాలు అందిస్తున్నామని, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనేది అర్థరహిత ఆరోపణ అని ఖండించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హుజూర్‌నగర్ రూరల్: ధరణి పోర్టల్ టెక్నికల్ అసిస్టెంట్ల అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామానికి చెందిన చెన్నగాని పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా లింగరాజు (సూర్యాపేట), ఉపాధ్యక్షుడిగా నలబోలు నవీన్‌రెడ్డి (నారాయణపురం), కోశాధికారిగా రాతికింది గురుప్రసాద్ (తాళ్లమల్కాపురం)ను ఎన్నుకున్నట్లు అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ జానీపాషా తెలిపారు. ఈ సందదర్భంగా నూతన అధ్యక్షుడు పురుషోత్తంగా మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో పనిచేస్తున్న టెక్నికల్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, గణేష్, సంపత్, వెంకయ్య, రాము, జానీపాషా, సలీం, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అందని ద్రాక్షలా ‘డబుల్ ఇళ్లు’

- మునగాలలో బిల్లులు రాక నిలిచిన ఇళ్ల నిర్మాణ పనులు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన భవనాలు
- ఇళ్ల పంపిణీ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలు



మునగాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

మునగాల : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లు మునగాల ప్రజలకు అందని ద్రాక్షలా మారాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా మండల కేంద్రమైన మునగాలలో నేటికీ ఒక్క ఇంటినైన పూర్తిచేసి లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. దీంతో ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం కలగానే మిగిలింది. అయితే ప్రభుత్వం గత రెండు సంవత్సరాల క్రితం మునగాల గ్రామానికి 60 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేసి, వాటిని జీప్లస్ త్రీ పద్ధతిలో సమీకృత అపార్ట్‌మెంట్ గృహాలుగా నిర్మించాలని నిధులు మంజూరు చేసింది. వెనువెంటనే జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. తొలుత కాంట్రాక్టర్ మొదటి దశ డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయగా, ప్రభుత్వం నుంచి విడుదల కావల్సిన నిధులు ఆలస్యం కావడంతో రెండో దశ నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఇలా కొన్ని ఇళ్లను నిర్మించి బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ ప్లాస్టింగ్ చేయకుండా అసంపూర్తిగా పనులను నిలిపివేశారు. దీనితో నేడు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల నిర్మాణ పనులను పూర్తిచేసి పంపిణీ చేయాలని పేద ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీలు కోరుతున్నాయి.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి అసవరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేసి యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి అర్హులైన వారికి పంపిణీ చేయాలి. లేనియెడల బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతాం.
– చింతకాయల నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు, మునగాల

బిల్లులు రాకపోవడంతో..

కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు రాకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాను. నిధులు మంజూరైన వెంటనే నిలిచిపోయిన పనులను ప్రారంభిస్తాం.
– వసంత, పీఆర్ ఏఈ, మునగాల

కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



సంక్షేమ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 595 మంది లబ్ధిదారులకు రూ.5.95 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అదేవిధంగా రూ.2.70 కోట్ల విలువైన కార్పొరేషన్ చెక్కులను, కులాంతర వివాహాల లబ్ధిదారులకు ప్రోత్సాహక చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపడుచులకు పుట్టినిల్లు తెలంగాణ అని చెప్పారు. పేదింటి ఆడపిల్లలకు సీఎం కేసీఆర్ మేనమామగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని రూ.3,500 కోట్లతో అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ మూడు ఏళ్ల కాలంలో నియోజకవర్గం ఎంత అభివృద్ధి జరిగిందో చర్చకు మేం సిద్ధమని కాంగ్రెస్ పార్టీ తరఫున మీరు సిద్ధమా అని ఎంపీ ఉత్తమ్‌కు ఆయన సవాల్ విసిరారు. కాంగ్రెస్, బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాలలో ఎక్కడా కూడా 24 గంటల పాటు రైతుకు నిరంతర విద్యుత్ అందించడం లేదని అన్నారు. కార్యక్రమంలో డీపీఓ యాదయ్య, ఎంపీపీలు గూడెపు శ్రీనివాస్, ఎం.పార్వతి, కె.వెంకటరెడ్డి, జెడ్పీటీసీలు కె.సైదిరెడ్డి, జగన్‌నాయక్, తహసీల్దార్‌లు జయశ్రీ, దామోదర్ రావు, ఎంపీడీఓలు, అధికారులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



యాదవులకు గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

2వ విడత గొర్రెల పంపిణీ..

మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన యాదవులకు రెండవ విడత మంజూరైన ఆరు యూనిట్ల గొర్రెలను శుక్రవారం పట్టణంలోని కొత్త క్యాంప్ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, జెడ్పీటీసీ కె.సైదిరెడ్డి, ఎంపీటీసీలు ముడెం గోపిరెడ్డి, రాజారావు, పలువురు లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌బాబు త్యాగం చిరస్మరణీయం

- మాజీ ఎమ్మెల్యే పద్మావతి



సంతోష్‌బాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి, నాయకులు

కోదాడ : దేశం కోసం ప్రాణాలు అర్పించిన దివంగత కల్నల్ బిక్కుమళ్ల సంతోష్‌బాబు త్యాగం చిరస్మరణీయమని, నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. శుక్రవారం కోదాడలో సంతోష్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువతకు స్ఫూర్తినిచ్చే మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. దేశ సరిహద్దులో ఎంతో మంది సైనికులు తమ జీవితాలను త్యాగం చేయడం వల్లే మనం స్వేచ్ఛగా బతుకుతున్నామని, మనమందరం వారికి ఎంతో రుణపడి ఉంటామన్నారు. సైనికులను, వారి కుటుంబాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వాసవీ యూత్ క్లబ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, గరిణె శ్రీధర్, గుడుగుంట్ల సాయి, వాసవీ క్లబ్ రీజియన్ చైర్మన్ జగిని ప్రసాద్, భరత్‌కుమార్, నవీన్, కిరణ్, భరత్, చంద్ర, బండారు శ్రీనివాసరావు, ప్రసాద్, సతీష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



అన్నదానం చేస్తున్న నాయకులు

మఠంపల్లి : మండలంలోని బోడబండతండాలో గల శ్రీఆంజనేయస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం గిరిజనులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్, రాంబాబు, రవి, రంగారావు, గ్రామస్తులు తదితరులున్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : తెలంగాణ రాష్ట్రంలో సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కోదాడలో నిర్వహించిన సంక్షేమ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతిఒక్కరూ సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. తెలంగాణలో ఏదో ఒక సంక్షేమ పథకం అందని ఇళ్లు లేదని అన్నారు. కుల వృత్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం బీసీ కులంలోని ప్రతి ఒక్కరికి లక్ష రూపాయలను త్వరలో అందజేస్తుందని చెప్పారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ప్రతి నెల రూ. 2016 పింఛన్ అందిస్తున్న రాష్ట్రం కూడా తెలంగాణ మాత్రమేనని అన్నారు. పేదల ప్రజల అభివృద్ధి కోసం గొర్రెల పంపిణీ, ఉచిత చేపపిల్లల పంపిణీ, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, రైతుబంధు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారి దయానందరాణి, ఎంపీపీలు చుండూరు వెంకటేశ్వర్లు, చింత కవిత, సత్యబాబు, చందు నాగేశ్వరరావు గింజుపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



నేరేడుచర్ల : దిర్శించర్ల జెడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్



కోదాడరూరల్ : రామలక్ష్మీపురంలో..

కోదాడరూరల్ : మండల పరిధిలోని రామలక్ష్మీపురంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి మీ పిల్లలను మా పాఠశాలకు పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఏ.హనుమంతరావు, ఉపాధ్యాయులు బడుగుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

మేళ్లచెరువు : పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం మండలంలోని రామాపురం, రేవూరు గ్రామాల్లో నిర్వహించిన డాక్టర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి, కోటేశ్వరరావు ,రమాదేవి, పూర్ణిమ, సాహెబ్ అలీ, మస్తాన్, బాలాజీ, జగ్గునాయక్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివించాలి

నేరేడుచర్ల : పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని సర్పంచ్ మాగంటి మాధవి అన్నారు. శుక్రవారం మండలంలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ సభ్యుడు గుంటిగొర్ల సైదులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజయ్‌కుమార్, యాదగిరి, వెంకటకృష్ణ, శంకర్, సైదులు, సతీష్ తదితరులు ఉన్నారు.



నడిగూడెం : చాకిరాలలో బడిబాటలో పాల్గొన్న ఎంపీపీ జ్యోతి, ఉపాధ్యాయులు

సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ప్రభుత్వం పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని చాకిరాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. గ్రామ సర్పంచ్ యాతాకుల వీరస్వామి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రవీందర్, సీఆర్‌పీ నందిగామ రామారావు, అంగన్‌వాడీ కార్యకర్త మౌనిక, మిట్టగణుపుల మోష, సురేష్, పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలంపై విచారణ జరిపించాలి



మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న నరేందర్‌గౌడ్, తదితరులు

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరా సెంటర్ సమీపంలోని వీధిలో గల ఖాళీ స్థలం మున్సిపాలిటీ రోడ్డు స్థలమని, దానిని కొందరు పార్కింగ్ స్థలంగా వాడుతున్నారని, ఈ విషయమై విచారణ జరిపించాలని టీడీపీ నల్లగొండ పార్లమెంటరీ అధికార ప్రతినిధి సోమగాని నరేందర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ దారి స్థలాన్ని బార్ అండ్ రెస్టారెంట్ పార్కింగ్ స్థలంగా వాడుతున్నారని తెలిపారు. దీనిని కబ్జా చేయాలని కొందరు చూస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం స్థానిక సోషల్ మీడియాలో కూడా వైరల్ అవుతుందన్నారు మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి సదరు స్థలంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం కమిషనర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎం.వెంకటేశ్వర్లు, ఎ.వెంకన్నగౌడ్, డి.వెంకటేశ్వర్లు, సతీష్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేత

మునగాల : మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ శివారులోని ఇందిర అనాథ వృద్ధాశ్రమానికి శుక్రవారం కోదాడకు చెందిన ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారి బత్తుల ఆదినారాయణ తన పుట్టినరోజు సందర్భంగా వారానికి సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు. సామాజిక కార్యకర్త వేమూరి సత్యనారాయణ పిలుపుతో నిత్యావసర సరుకులు అందించినట్లు తెలిపారు. ఆదినారాయణ కుటుంబసభ్యులు బత్తుల రాజేశ్వరి, భవ్యశ్రీ, శశాంక్, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ గోదా, పద్మావతి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్కర బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై వేంకటేశ్వరస్వామి వారిని శేష వాహనంపై అధిష్టింపజేసి, ఉభయదేవేరులైన గోదా, పద్మావతి అమ్మవార్లను గజ వాహనంపై అధిష్టింపజేసి పట్టు వస్త్రాలు, పూలు, తులసిమాలలతో అందంగా అలంకరించారు. మొదట విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, కంకణధారణ చేశారు. తదుపరి స్వామి, అమ్మవార్లకు జీలకర్రను శిరస్సున అలంకరింపజేశారు. స్వామివారి చేత మంగళసూత్ర ధారణ చేయించి కల్యాణ ఘట్టాన్ని కనుల పండువగా జరిపారు. అనంతరం అన్నదానం చేశారు. ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మావతి వేర్వేరుగా స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారులు, పాకల మండలి సభ్యులు, భక్తులు పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.


ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



చిలుకూరులో జెండా ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు

చిలుకూరు : మండల కేంద్రంలో శుక్రవారం ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎస్టీయూ సంఘం పాత్ర కీలకమైందని అన్నారు. ముందుగా ఉపాధ్యాయ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎస్టీయూ సంఘం సీనియర్ నాయకుడు గండెల అంజయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు యలగొండ శ్రీను, ప్రధాన కార్యదర్శి మంద పుల్లయ్య, సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, సీపీఐ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన



గరిడేపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

గరిడేపల్లి : విధుల్లో ఉన్న ఎస్ఐ కాలర్‌ను ఓ వ్యక్తి పట్టుకుని నెట్టివేసిన సంఘటన శుక్రవారం గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ పి.వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుతుబ్‌షాపురం గ్రామానికి చెందిన బాత్కు సైదులు– బాత్కు భవానీలు భార్యభర్తలు. వీరిద్దరి మధ్య వారం రోజులుగా గొడవ జరుగుతుండటంతో శుక్రవారం పోలీసులు గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌ను పిలిపించారు. ఈ క్రమంలో బాత్కు సైదులు తమ్ముడు బాత్కు వలరాజుకు, బాత్కు భవాని తమ్ముడు కోడి వీరబాబుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఇరువురిని ఎస్ఐ వెంకట్‌రెడ్డి అదుపుచేస్తున్న సమయంలో బాత్కు వలరాజు ఎస్ఐ కాలర్‌ను పట్టుకోవడంతో పాటు చేతులతో నెట్టివేశాడు. దీంతో పోలీసులు వలరాజును ఎస్ఐ గదిలోకి తీసుకెళ్లారు. అయితే అతన్ని తీసుకెళ్లిన రెండు నిమిషాల్లో స్పృహ తప్పి కిందపడిపోవడంతో వెంటనే పోలీస్ వాహనంలోనే హుజూర్‌నగర్ ఆసుపత్రికి తరలించారు.

విధులకు ఆటంకం కలిగించినందుకు..

కాగా బాత్కు వలరాజును లోపలికి తీసుకెళ్లి బలంగా కొట్టడంతోనే స్పృహ తప్పాడంటూ అతని కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపిస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట హైవేపై ఆందోళన చేశారు. తన కుమారుడిని కొట్టిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని యువకుడి తండ్రి బాత్కు లింగయ్య డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎస్ఐ వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో వలరాజు, వీరబాబుల మధ్య వాగ్వివాదం జరుగుతుండగా తాను నిలువరించే క్రమంలో తన కాలర్ పట్టుకొని నెట్టివేశాడని, పోలీసుల సహాయంతో వారిద్దరిని లోపలికి తీసుకెళ్లి ఇద్దరిని వేర్వేరుగా కూర్చోబెట్టినట్లు తెలిపారు. ఆ సమయంలోనే వలరాజు స్పృహ తప్పి పడిపోవడంతో వెంటనే తమ వాహనంలోనే ఆసుపత్రికి తరలించామన్నారు. విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ అక్బర్ అలీని కూడా వలరాజు కాలర్ పట్టుకోవడంతో పాటు చేతితో నెట్టివేయడం జరిగిందని దీంతో విధులకు ఆటంకం కలిగించినందుకు హెడ్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. కాగా, భవాని ఫిర్యాదు మేరకు భర్త సైదులు, అతడి తల్లిదండ్రులు జానకమ్మ, లింగయ్య, తోడి కోడలు మల్లమ్మ, వలరాజుపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

సీపీఐ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



బహిరంగ సభ వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

చిలుకూరు : ప్రజాసమస్యల పరిష్కారానికి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రకాశం స్టేడియంలో ఈ నెల 11వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించబోయే సీపీఐ ప్రజా గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం చిలుకూరులో ప్రజాగర్జన వాల్ పోస్టర్‌ను సీపీఐ నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని విమర్శించారు. ప్రజాగర్జన సభకు సీపీఐ జాతీయ, రాష్ట్ర అగ్ర నాయకులు వస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, పార్టీలకతీతంగా ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు, మండల సహాయ కార్యదర్శి సాహెబ్ అలీ, నాయకులు చిలువేరు అంజనేయులు, కస్తూరి సత్యం , కట్టెకోల నాగేశ్వరరావు, దొడ్డా నాగేశ్వరరావు, ముత్తారెడ్డి, మౌలానా, నాయకులు పాల్గొన్నారు.

పటిక స్వాధీనం.. ఇద్దరిపై కేసు

మునగాల(కోదాడ): ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి సూర్యాపేటకు అక్రమంగా పటిక తరలిస్తున్న ఓ వాహనాన్ని పోలీసులు శుక్రవారం మునగాలలో స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం... జగ్గయ్యపేట నుంచి బొలేరో వాహనంలో 20బస్తాల పటికను లోడ్ చేసుకొని ఆత్మకూరు(ఎస్) మండలం పాత సూర్యాపేటకు చెందిన సుంకరబోయిన లింగయ్య, గగులోతు హరి తరలిస్తుండగా మార్గ మధ్యలో మునగాల వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. దీంతో సుమారు పది క్వింటాళ్ల పటికను స్వాధీన పర్చుకొని ఇరువురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం.. ఊరంతా సంబురం



జల బిందెలతో ఆలయానికి తరలివెళ్తున్న మహిళలు, గౌడ కులపెద్దలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో శ్రీకంఠమహేశ్వరస్వామి మూడవ వార్షికోత్సవాన్ని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నా గన్నగౌడ్, ఆలయ చైర్మన్ కాసాని గురవయ్యగౌడ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ నిర్వహించారు. గ్రామంలోని మహిళలు జలబిందెలు, బోనాలతో ఆలయానికి తరలివెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. హుజూర్‌నగర్ కల్లుగీత సొసైటీ అధ్యక్షుడు వల్లపుదాసు కృష్ణగౌడ్, యరగాని రామస్వామి, యలక సైదులు, గోపాలం, కిరణ్‌గౌడ్, మట్టపల్లిగౌడ్, భిక్షంగౌడ్, నర్సింహారావుగౌడ్, నాగరాజు, గురవయ్య, సైదులు, గౌడ కులపెద్దలు పాల్గొన్నారు.

రామాపురంలో పీవీసీ పైపులు దగ్ధం

నడిగూడెం: మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన అలవాల రామారావుకు చెందిన వ్యవసాయ భూమిలో శుక్రవారం వరి కొయ్యకాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పటించారు. దీంతో వ్యవసాయ బావి వద్ద ఉన్న పీవీసీ పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. అలాగే స్టార్టర్, కొంత విద్యుత్ మోటారు దగ్ధమైంది. దాదాపు రూ.30 వేలు నష్టం జరిగినట్లు రైతు రామారావు తెలిపారు.